

మద్యం దుకాణాలుంటే చర్యలు

ఆలయ ప్రాంగణ పరిసరాల్లో ఎలాంటి మద్యం దుకాణాలున్నా చర్యలు తప్పవని ఎస్పీ సతీష్ కుమార్ హెచ్చరించారు. 8లో



గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యం

ఎంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించే లక్ష్యంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో



కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్

కొత్తవలస-కిరండూల్ రైల్వేలైన్‌లో శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పర్యావరణం పరీక్ష

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ పర్యావరణం పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 338 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. నిర్ణీత షెడ్యూల్ మేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులు సమయానికి హాజరయ్యేలా కళాశాల ప్రిన్సిపాల్స్ ముందస్తు ఏర్పాట్లు చేశారు. కేంద్రాల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మూడు జిల్లాల పరిధిలో 56,821 మంది పరీక్షకు హాజరుకాగా, 873 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఉమారాణి తెలిపారు.

శిశువు మృతిపై విచారణ

ముంచంగిపుట్టు: మండలంలోని కుముడ గ్రామానికి చెందిన మత్స్యరాజు, మహేశ్వరి దంపతుల శిశువు మృతిపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్ విచారణ నిర్వహించారు. గురువారం విశాఖ కేజీహెచ్‌లో మృతిచెందగా, శిశువు మృతదేహాన్ని స్కూటీపై తరలించడం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ వెంటనే స్పందించి పాడేరు నుంచి అంబులెన్సులో గ్రామానికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై ఆయన విచారణకు ఆదేశాలు జారీ చేయడంతో ఏడీఎంహెచ్‌వో కుముడ గ్రామానికి శుక్రవారం వెళ్లారు. శిశువు మృతికిగల కారణాలపై బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. వైద్య సిబ్బంది రోగులపట్ల స్నేహభావంతో మెలగాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

తోటలు దగ్ధం.. రూ.5 లక్షల నష్టం



దగ్ధమైన జీడి తోటలు

ముంచంగిపుట్టు: ఏనుగురాయి పంచాయతీ చోటముక్కిపుట్టు, రాళ్లపూట్ గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన జీడి, కాఫీ సిల్వర్‌ఓక్ తోటలు గురువారం రాత్రి దగ్ధమయ్యాయి. మతం సత్యంపడాల్, తాంగుల పద్మ చెందిన రెండు ఎకరాల జీడి తోటలు, వంతల కమలకు చెందిన ఎకరా కాఫీ, సిల్వర్‌వోక్ తోట, మతం మత్స్యరాజు పడాల్‌కు చెందిన ఎకరా జీడితోట కాలిపోయాయి. న్యాయం చేయాలని బాధిత రైతులు తహసీల్దార్‌ను కోరారు. నష్టం సుమారు రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

యువతకు క్రీడా కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

చింతపల్లిరూరల్: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సీఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం అన్నవరంలో వివిధ క్రీడలకు సంబంధించి కిట్లను గిరిజన యువకులకు పంపిణీ చేశారు. అసిస్టెంట్ కమాండెంట్ దేవేంద్ర ఆధ్వర్యంలో వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ కిట్లు, నోట్ పుస్తకాలు, రేడియోలు అందజేశారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



సూచనలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామని విశాఖ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. కుముడ గ్రామంలో జెడ్పీ నిధులు రూ. సుమారు 10.9 లక్షలతో చేపట్టిన రక్షణ మంచినీటి పథకం ట్యాంక్ పనుల నాణ్యతను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ మతం ముక్తమ్మ, ఎంపీటీసీ రాములమ్మ తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పథకం మంజూరుకు నిధులు మంజూరు చేశామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

ఆరోగ్య మన్యం

జిల్లాలోని ఆస్పత్రుల్లో వైద్యసేవలు పూర్తిస్థాయిలో మెరుగుపడ్డాయి. అత్యవసర వైద్యం సైతం స్థానికంగా అందుబాటులోకి రావడంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రుల్లో వైద్య నిపుణులను పూర్తిస్థాయిలో నియమించింది. అధునిక వసతులు కల్పించింది. దీంతో ఉన్నత వైద్యానికి దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పింది.



పాడేరులో జిల్లా ఆస్పత్రి



పాడేరులో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న కొత్త వైద్యులు

- మెరుగుపడిన వైద్యసేవలు
- పూర్తిస్థాయిలో సౌకర్యాలు
- అందుబాటులో వైద్య నిపుణులు

సాక్షి, పాడేరు: ఒకప్పుడు అత్యవసర వైద్యం కోసం వెళ్తే రోగులను దూరంగా ఉన్న విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరంలోని పెద్దాస్పత్రులకు తరలించేవారు. రోగులు చేరుకునే లోపే మరణాలు సంభవించేవి. రోగ నిర్ధారణకు కూడా మన్యంలో వైద్య నిపుణులు ఉండేవారు కాదు. గిరిజనులు ఉన్నత వైద్యం అందక నరకం చూసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాల్లోని వైద్యసేవలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. మహానేత వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా మైదాన ప్రాంతాల్లో కార్పొరేట్ వైద్యం గిరిజనులకు అందుబాటులోకి తెచ్చి ప్రాణాలు కాపాడారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల ముంగిటకే ఉన్నత వైద్యాన్ని తీసుకువస్తున్నారు.

- జిల్లా కేంద్రమైన పాడేరులో రూ.500 కోట్లతో వైద్య కళాశాలను నిర్మిస్తున్నారు. మరో వైపు అన్ని ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలతోపాటు, వైద్యనిపుణులను నియమించి గిరిజనులకు ప్రాణ రక్షకుడిగా నిలుస్తున్నారు. ఏజెన్సీలో సేవలందించేందుకు వైద్య నిపుణులు ముందుకు వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటికి రిఫరల్ ఆస్పత్రులు వైద్యవిధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్నాయి.
- పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఆర్థో, జనరల్ మెడిషన్, గైనికాలిజిస్టు-2, ఎనస్తీసియా, ఈఎన్‌టీ, పిడియాట్రిక్, మైక్రోబయాలజీ, పాథాలజీ, డెంటల్ వైద్యులతో పాటు అదనంగా మరో 8 మంది ఎంబీబీఎస్ వైద్యులు సేవలందిస్తున్నారు.
- అరకులోయ ఏరియా ఆస్పత్రిలో ఆర్థో, పిడియాట్రిక్, గైనిక్, జనరల్ సర్జన్‌తో పాటు మరో ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు పనిచేస్తున్నారు.
- చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో గైనిక్-2, పిడియాట్రిక్, ఎనస్తీషియాతో పాటు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు ఉన్నారు.
- రంపచోడవరం ప్రాంతీయ ఆస్పత్రిలో జనరల్ మెడిషన్, ఆర్థో, పాథాలజీ, ఈఎన్‌టీతో పాటు ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు, చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జనరల్ మెడిషన్, ఆర్థో, ఈఎన్‌టీ, గైనిక్, ఎనస్తీసియాతో పాటు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు పనిచేస్తున్నారు.
- కూనవరం సీహెచ్‌సీలో పిడియాట్రిక్, జనరల్ సర్జన్‌తో పాటు ఎంబీబీఎస్ వైద్యుడు సేవలందిస్తున్నారు.
- ముంచంగిపుట్టు, అడ్డతీగల, వై.రామవరం సీహెచ్‌సీల్లో వైద్య నిపుణుల సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. నియమితులైన వైద్యుల్లో కొంతమంది విధుల్లో చేరాల్సి ఉంది.

పెరిగిన ఓపీ

- జిల్లా వ్యాప్తంగా అన్ని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఓపీ పెరిగింది. పాడేరు జిల్లా ఆస్పత్రిలో ప్రతి రోజు ఓపీ విభాగంలో సుమారు 400 మంది రోగులు వైద్యం పొందుతున్నారు. సుమారు 200 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు.
- ఆర్థోతోపాటు గైనిక్ ఆపరేషన్లు ఇక్కడే జరుగుతున్నాయి. దీంతో పాడేరు నుంచి కేజీహెచ్‌కు రిఫరల్ కేసులు తగ్గాయి. అరకులోయ, రంపచోడవరం, చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రుల్లో రోజువారీ ఓపీ గతంలో కన్నా పెరిగింది. పాడేరు జిల్లా ఆస్పత్రిలో రోజువారి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. చింతపల్లి, అరకులోయ, రంపచోడవరంతోపాటు చింతూరు, కూనవరం సీహెచ్‌సీల్లోను వైద్య నిపుణులు శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

రిఫరల్ కేసులు తగ్గాయి



పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యనిపుణుల సేవలు అందుబాటులోకి రావడంతో స్థానికంగానే మేజర్ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాం. పాడేరు జిల్లా ఆస్పత్రిలో రోగులకు పూర్తిస్థాయి సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. స్థానికంగానే ఉన్నత వైద్యసేవలు అందిస్తున్నాం.

– **డాక్టర్ కె.కృష్ణారావు**, సూపరింటెండెంట్, పాడేరు జిల్లా ఆస్పత్రి

పూర్తిస్థాయిలో వైద్యనిపుణులు



జిల్లాలోని అన్ని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య నిపుణుల నియామకం చరిత్రాత్మకం.ఉన్నత వైద్య సేవలు అందుబాటులోకి రావడం, రోజువారీ శస్త్ర చికిత్సలు జరుగుతుండటం రోగులకు ఎంతో మేలు జరుగుతోంది. ఆస్పత్రుల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తున్నాం.

– **డాక్టర్ శంకర్‌ప్రసాద్**, జిల్లా సమన్వయకర్త, వైద్యవిధాన పరిషత్

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి అంబటి రాంబాబును కోరిన రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



నిర్వాసితుల సమస్యలను మంత్రి అంబటి రాంబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కోరారు. శుక్రవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించిన రాష్ట్ర జలవనరుల మంత్రి అంబటి రాంబాబును ఆమె కలిశారు. దేవీపట్నం ఎంపీపీ కుంజం మురళీ, వైస్ ఎంపీపీ గారపాటి మురళీ, పార్టీ నాయకులు కందుల బాబ్జి, పోలిశెట్టి రామకృష్ణ, కట్టా సత్యనారాయణలతో కలిసి పోలవరం నిర్వాసితుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పోలవరం ప్రాజెక్టు ముంపులో గ్రామాలు ఖాళీ చేసిన 1200 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పొందేందుకు అర్హులుగా గుర్తించాలని కోరారు. అర్హులైన కొంత మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జమ కాలేదన్నారు. అలాగే వారికి ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. గ్రామాలు ఖాళీ చేసి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉంటున్న నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి కొద్ది రోజుల్లో డబ్బులు మంజూరు చేస్తామన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు సీఎం దృష్టిలో ఉన్నట్లు తెలిపారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

కేజీహెచ్ ఎస్టీ సెల్‌పై పర్యవేక్షణేదీ?

గిరిజనుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్న సిబ్బంది



కేజీహెచ్ క్యాజువాల్టీ వద్ద ఎస్టీ సెల్

మహారాణిపేట: గిరిజన రోగుల కోసం కేజీహెచ్ క్యాజువాల్టీ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎస్టీ సెల్‌పై పర్యవేక్షణ కరువైంది. ఇక్కడి సిబ్బందిపై గతంలోనూ ఆరోపణలు వెల్లువెత్తగా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో వారంతా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన సేవా, సమాచార కేంద్రం పేరిట ఇక్కడ ఎస్టీ సెల్‌ను ఏర్పాటు చేశారు. కానీ పాడేరు ఐటీడీఏ పర్యవేక్షించడం లేదనే విమర్శలు ఉన్నాయి. జెడ్పీ సర్వ సభ్య సమావేశంలో ఇక్కడ సిబ్బంది తీరుపై పలువురు సభ్యులు ఆరోపణలు చేశారు. సిబ్బందితోపాటు అప్పటి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మైథిలి సమావేశానికి వచ్చి వివరణ ఇచ్చారు. అయినా ఎస్టీ సెల్ సిబ్బంది తీరులో ఎలాంటి మార్పు రాలేదన్న విమర్శ ఉంది. కేజీహెచ్‌కు మన్యం ప్రాంతానికి చెందిన 11 మండలాల గిరిజనులతోపాటు ఉత్తరాంధ్ర ప్రాంతం, ఒడిశా, చత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన గిరిజనులు వైద్యం కోసం వస్తుంటారు. నెలకు 4 వేల మంది గిరిజనులు చికిత్స పొందుతుంటారు. వారి ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తోంది. కాగా..ఇక్కడ నలుగురు సిబ్బంది ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులను వైద్యుల వద్దకు తీసుకెళ్లి చూపించాల్సిన బాధ్యత ఈ సెల్‌పై ఉంది. అవసరమైన పరీక్షలు, స్కానింగ్‌తో పాటు గిరిజనులకు భోజనాలు, మందులు, తిరుగు ప్రయాణానికి ఖర్చులు కూడా ఇవ్వాలి. కానీ దీనికి భిన్నంగా ఇక్కడ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఉచితంగా సేవలందించాల్సిన చోట వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

పునరావృతం కాకుండా చర్యలు: జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: స్కూటీపై పసికందు మృతదేహం తరలింపుపై జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర స్పందించారు. శుక్రవారం ఆమె కుముడలో పసికందు తల్లిదండ్రులు మత్స్యరాజు, మహేశ్వరీ పరామర్శించారు. పసికందు మృతికి కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధితుల తెలిపిన వివరాల ప్రకారం విచారణ చేపడతామని, వాస్తవమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

పసికందు ఘటనపై సమగ్ర దర్యాప్తు



కేజీహెచ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు

- ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లడం దురదృష్టకరం
- పలు శాఖల సమన్వయం లోపం వల్లే...
- రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు
- ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

మహారాణిపేట: కేజీహెచ్ నుంచి పసికందు మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లిన సంఘటనలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు కోరారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఇతర వైద్యులు, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి రామకృష్ణతో రవిబాబు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఈ సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. పలు శాఖల సమన్వయ లోపం కనిపిస్తోందని, ఇలాంటి సంఘటన మరోసారి పునరావృతం కాకూడదన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. గిరిజన ప్రాంతాల్లో ఏడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేయడంతోపాటు పాడేరులో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారన్నారు. గిరిజనుల ఆరోగ్యం కోసం ఎంత ఖర్చు అయినా భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అయితే సమన్వయ లోపం వల్ల బిడ్డను తల్లి కోల్పోయిందన్నారు. పాడేరు ఆస్పత్రిలో చేరిన మహేశ్వరికి నొప్పులు రాకపోయినా వైద్యులు డెలివరీ చేశారని, ఫలితంగా బిడ్డ అనారోగ్యంతో పుట్టారని రవిబాబు అన్నారు. కేజీహెచ్‌లో పసిబిడ్డకు చికిత్స అందిస్తున్న వైద్యులు వెంటిలేటర్ ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈ క్రమంలో పసికందు గురువారం ఉదయం 7.50 గంటలకు చనిపోతే... ఎస్టీ సెల్‌కు 9.50 గంటలకు సమాచారం ఇచ్చారని, ఇందులో సమన్వయ లోపం ఉందని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని డీఎంఈకి ఫోన్ చేసి కోరారు. చనిపోయిన తర్వాత ఒక గంట ఉంటే అంబులెన్సు ఏర్పాటు చేసేవారన్నారు.

- ప్రస్తుతం కేజీహెచ్‌లో ఉన్న ఎస్టీ సెల్ సిబ్బందిని మార్పు చేయాలని, అక్కడ వైద్యుడిని నియమించాలని కలెక్టర్ మల్లికార్జునను కుంభా రవిబాబు కోరారు. ఇక్కడి సిబ్బంది పనితీరుపై ఆరోపణలు రావడంతో మార్పు చేసి కొత్తవారిని నియమించాలని కోరారు.

ఇద్దరు నర్సులకు చార్జి మెమోలు

కేజీహెచ్ పిల్లల వార్డులో పసికందు మృతిపై సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించారు. వార్డులో ఇద్దరు నర్సులకు చార్జి మెమోలు జారీ చేశారు. వారం రోజుల వ్యవధిలో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

విచారణ కమిటీ నియామకం

కేజీహెచ్‌లో పసికందు మృతి, అనంతరం మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లిన సంఘటనపై ఇద్దరు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఆర్‌ఎంవో డాక్టర్ వాసుదేవను కమిటీ సభ్యులుగా నియమిస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ మూడు రోజుల్లో విచారణ జరిపి నివేదిక సమర్పిస్తుంది.

స్పందనకు విశేష ఆదరణ

- పెరుగుతున్న వినతులు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన 65 స్వీకరణ



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశమందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు విశేష ఆదరణ లభించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ, డీఆర్వో అంబేద్కర్ గిరిజనుల నుంచి 65 వినతులు స్వీకరించారు. వీటిలో 20 వరకు భూముల సమస్యలకు సంబంధించిన వినతులు ఉన్నాయి. వీటిని నిబంధనల ప్రకారం పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, డీపీవో కొండలరావు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ రాజు, జిల్లా వ్యవసాయాధికారి నందు, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రోహిణి, జీసీసీ డీఎం పార్వతమ్మ, డీఎల్పీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- మిరియాలు సేకరణకు అల్యూమినియం నిచ్చెనలు పంపిణీ చేయాలని పెదబయలు మండలం పెదాకోడాపల్లి పంచాయతీ కొత్తపోయిపల్లికి మర్రి రాజారావు కోరాడు.
- పిట్టలబొర్ర నుంచి జామిగుడకు 8కిలోమీటర్ల రోడ్డు,చింతలవీధి నుంచి జామిగుడకు 2కిలోమీటర్ల రోడ్డును మంజూరు చేయాలని పెదబయలు మండలం గిన్నెలకోట ఎంపీటీసీ గడుతూరు నిర్మల వినతిపత్రం అందజేశారు.
- వన్నాడ జంక్షన్ నుంచి పంగలం,వంకరాయి,సంపంగిబంద గ్రామం వరకు రోడ్డు మంజూరైందని వెంటనే పనులు ప్రారంభించాలని పెదబయలు మండలం గోమంగి పంచాయతీ వంకరాయి గ్రామస్తులు గడుతూరు కోటిబాబు,బాలకృష్ణ కోరారు.
- చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ గెంజిగూడలో జలజీవన్ మిషన్‌లో తాగునీటి పథకం నిర్మించారని, తాగునీరు గ్రామం మొత్తానికి సరిపోవడం లేదని, అదనంగా మరో బోరుబావిని అందుబాటులోకి తేవాలని లకే కార్తీక్, గ్రామస్తులు కోరారు.
- పెదగొంది నుంచి కృష్ణాపురం వరకు రెండు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి ఆర్‌అండ్‌బీశాఖ నిధులు మంజూరు చేసిందని, పనులు వెంటనే ప్రారంభించాలని,పెదగొంది గ్రామంలో రోడ్లు,అంగన్‌వాడీ భవనం నిర్మించాలని చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీ తెరపల్లి గిరిజనులు జి.రమణ,రమేష్ కోరారు.
- స్వయం ఉపాధి పథకాన్ని మంజూరు చేయాలని డుంబ్రిగుడ మండలం కంద్రూం పంచాయతీకి చెందిన ఎస్.చినబాబు కోరాడు.
- జి.కే.వీధి పంచాయతీ వీరవరం గ్రామానికి విద్యుత్,రోడ్డు,పాఠశాల, అంగన్‌వాడీ సౌకర్యాలను కల్పించాలని అదే ప్రాంతానికి చెందిన మర్రి లక్ష్మయ్య,పాంగి రత్తులు వినతి పత్రం అందజేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



వీఆర్ పురం: మండలంలోని రేఖపల్లిలో ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ, అలోక్ విజన్ ప్రోగ్రామ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 600 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే 200 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేసినట్టు సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు తెలిపారు. 175 మందికి కంటి ఆపరేషన్లు అవసరమైని గుర్తించినట్టు చెప్పారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ ప్రేమ్‌జిత్, పెట్రాఅపెల్ట్, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు



పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు



మత్స్యగుండం వద్ద పూజలు చేస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి

మత్స్యగుండంలో జాతర ప్రారంభం

సాక్షి,పాడేరు: ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతమైన పవిత్ర మత్స్యగుండంలో శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకుడు, ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అధికారులు మత్స్యలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్ పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మత్స్యగుండాన్ని సందర్శించారు.మతం సర్పంచ్ మతం శాంతికుమారి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారికి ఘన స్వాగతం పలికారు. మత్స్యలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మత్స్యదేవతలను దర్శించుకుని పూజలు చేశారు. ఓం నమఃశ్శివాయ స్మరణతో పరిసరాలు హోరెత్తాయి.ఉత్సవాలపై అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమీక్షించారు. వ్యాపారులు ఏర్పాటు చేసిన దుకాణాలను వారు సందర్శించారు. పలు రకాల బొమ్మలను కొనుగోలు చేశారు.

108 శివలింగాలతో ప్రదర్శన

బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో గిరిజన మహిళలంతా 108 శివలింగాలతో శనివారం సాయంత్రం పాడేరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఓం నమఃశ్శివాయ స్మరణతో పాడేరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పాడేరులో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీలతో పాటు చింతలవీధి ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, పాడేరు మాజీ సర్పంచ్ కిల్లు వెంకటరత్నం, ఐటీడీఏ సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



108 శివలింగాలను ప్రదర్శిస్తున్న గిరిజన మహిళలు

నేడు, రేపు నామినేషన్లు స్వీకరించం

- కలెక్టర్, ఎన్నికల అధికారి మల్లికార్జున
- వరుసగా ప్రభుత్వ సెలవులే కారణం



నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర్య అభ్యర్థి ఇల్లిపల్లి అప్పలరాజు

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : రెండు రోజుల పాటు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి నామినేషన్లను స్వీకరించబోమని కలెక్టర్, ఎన్నికల అధికారి డా.ఎ. మల్లికార్జున తెలిపారు. శనివారం మహా శివరాత్రి ప్రభుత్వ సెలవు. 19వ తేదీ ఆదివారం సెలవు కాడంతో నామినేషన్లు స్వీకరించడం జరగదన్నారు. సోమవారం నుంచి తిరిగి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి శుక్రవారం స్వతంత్ర అభ్యర్థి ఇల్లిపల్లి అప్పలరాజు నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆనందపురం మండలం, తర్లువాడ గ్రామానికి చెందిన ఇల్లిపల్లి అప్పలరాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గురువారం నాడు రెండు సెట్ల పత్రాలు నామినేషన్ దాఖలు చేసిన స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తిరిగి శుక్రవారం మరొక రెండు సెట్ నామినేషన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: మన్యంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి.అరకులోయ,చింతపల్లిలో 13డిగ్రీల ఉష్ణోగ్రత శుక్రవారం నమోదైంది. పొగమంచు తీవ్రత లేకపోవడంతో పాటు ఉదయం 8గంటలకే సూర్యోదయం అయ్యింది.

ఫార్మాకు విశాఖ అనుకూలం

గ్లోబల్ టెక్ సమ్మిట్ ఆరంభం మాత్రమే

- భవిష్యత్తులో విశాఖలో మరిన్ని సదస్సులు
- ముగిసిన గ్లోబల్ టెక్ సమ్మిట్–2023
- పాల్గొన్న వెయ్యి మంది ప్రతినిధులు



గ్లోబల్ టెక్ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రెండు రోజుల పాటు నగరంలోని నిర్వహించిన గ్లోబల్ టెక్ సమ్మిట్–2023 విశాఖ అభివృద్ధికి ఆరంభం మాత్రమే అని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన గ్లోబల్ టెక్ సమ్మిట్ విజయవంతంగా ముగిసింది. ముగింపు రోజు సదస్సులో ఫార్మా పరిశ్రమల అభివృద్ధి, సాంకేతిక వినియోగంపై చర్చించారు. అలాగే వివిధ రంగాల్లో ఐటీ వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. విశాఖలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు.. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై చర్చించారు. అలాగే మరో వైపు తమ స్టార్టప్‌లను వివరిస్తూ సలహాలు సూచనలు పొందారు. విశాఖలో ఫార్మా రంగం అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఫార్మాస్యూటిల్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ తెలిపారు. అతి తక్కువ వ్యయంతో నాణ్యమైన మందులను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విశాఖలో ఫార్మా బల్క్ ఉత్పత్తుల పరిశ్రమలు ఉన్నాయని, కానీ ఫార్ములా తయారీ చేసే పరిశ్రమలు లేవన్నారు. వాటిని స్థాపించడం వలన అనేక మందికి ఉపాధి కలుగుతుందన్నారు.

జీ–20 దేశాల్లో సదస్సు

గ్లోబల్ టెక్ సమ్మిట్‌ను జీ20 దేశాల్లో నిర్వహిస్తామని కో కన్వీనర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. 20 దేశంలో నిర్వహించిన తరువాత మళ్లీ ముగింపు సమ్మిట్ విశాఖలోనే నిర్వహిస్తామని తెలిపారు. రెండు రోజుల సమ్మిట్‌లో 1000 మంది ప్రతినిధులు పాల్గొన్నారని వారిలో 400 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నారన్నారు. విశాఖలో పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల కంటే ముందు బీపీఎల్ కంపెనీలు ఏర్పాటు ముఖ్యమన్నారు.

రాష్ట్ర జీడీపీలో ఐటీ రంగానిదే కీలకపాత్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 25 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. అయితే వారిలో చాలా తక్కువ మంది ఆంధ్రప్రదేశ్ పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్తులో వారందరూ విశాఖలో పనిచేసే విధంగా సంస్థలు ఏర్పాటవుతాయని ఆశభావం వ్యక్తం చేశారు.

సాంకేతికతతో రియల్ ఎస్టేట్ మరింత అభివృద్ధి



రియల్ ఎస్టేట్ రంగంలో సాంకేతికతను జోడించడంతో మరింత వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుంది. అతి తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి వ్యాపారం చేరువ అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇటువంటి సదస్సుల ద్వారా మరింత సాంకేతికతను ఎలా అనుసంధానం చేయాలని తెలుసుకోవచ్చు..

– ముక్క ఓబుల్ రెడ్డి, చైర్మన్ హనీ గ్రూప్

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో వస్తువులు దగ్ధం

అనకాపల్లిటౌన్ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లో గృహోపకరణాలు దగ్ధమై రూ.60వేలు ఆస్తి నష్టం జరిగిందని అనకాపల్లి అగ్నిమాపకశాఖ అధికారి నర్సింగరావు శుక్రవారం చెప్పారు. స్థానిక కోట్నివీధికి చెందిన సాలాపు శ్రీనివాసరావు ఇంట్లో శుక్రవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా కొన్ని వస్తువులు కాలిపోయాయి.

అదే సమయంలో ఆ ఇంట్లో ఉన్న కుమారి స్వల్ప అస్వస్థతకు గురవడంతో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

గిట్టుబాటు ధర కల్పనే లక్ష్యం

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా గిరిజన రైతుల వ్యవసాయ, వాణిజ్య పంటల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించే లక్ష్యంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. తన ఛాంబర్‌లో వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యవసాయ మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలు మేరకు పొలంబడి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం రైతులు మిరియాలు, పసుపు సేకరిస్తున్నారని, వాటిని దళారులకు విక్రయించకుండా చూడాలన్నారు. మిరియాలకు కిలో రూ.400 పైగా ధరతో రైతులు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాఫీ కల్లాలకు దరఖాస్తులు స్వీకరించాలని, కేంద్ర కాఫీ బోర్డు 1000వరకు కల్లాలను మంజూరు చేస్తుందన్నారు. ఈకేవైసీ, ఈ–క్రాప్ నమోదులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈనెల 20వ తేదీ లోగా కస్టమ్ హైరింగ్ సెంటర్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని, ఈనెల 28వ తేదీ లోగా యంత్ర పరికరాల ఖరీదులో 50శాతం డిపాజిట్ నమోదును పూర్తిచేసి బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవెన్యూ ప్లాంటేషన్లు వేసేందుకు మార్చి నెలలోనే ప్రతిపాదనలు అందజేయాలన్నారు. వ్యవసాయ, అనుబంధ విభాగాల అధికారులు విధులు పట్ల ఆలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడుతూ రైతుల ఆసక్తి మేరకు కాఫీకి నీడనిచ్చే మొక్కలను పంపిణీ చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ, జిల్లా వ్యవసాయాధికారి నందు, ఉద్యానవన అధికారి రమేష్, మినుములూరు ఎస్ఎల్‌వో విష్ణు, ఏడీఏలు శ్రీధర్, జాహ్నవి, పాత్రుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డౌనూరు విద్యార్థి



ప్రకాష్

కొయ్యూరు: డౌనూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థి అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో విద్యార్థిక గెమ్మెలి ప్రకాష్ ప్రతిభ కనబరిచాడు. ఇందులో భాగంగా ప్రకాష్‌ను రాష్ట్రస్థాయితో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. త్వరలో జాతీయ స్థాయిలో జరగనున్న పోటీలకు రాష్ట్రం తరఫున పాల్గొనన్నుట్లు పాఠశాల హెచ్ఎం కె.ప్రభుదాస్, తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థి ప్రకాష్‌ను హెచ్ఎంతో పాటు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో బోడంనాయుడు, పీడీ ఎస్.పోతురాజు తదితరులు అభినందించారు. విద్యార్థి ప్రకాష్ మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, సొంత గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

మద్యం దుకాణాలుంటే చర్యలు

- ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరిక
- ఆలయ పరిసరాల్లో లేకుండా చూడాలని సూచన

కూనవరం: మహాశివరాత్రి వేడుకలు పురస్కరించుకొని ఆలయ ప్రాంగణం నుంచి పార్కింగ్ ప్రదేశం వరక ఎలాంటి మద్యం దుకాణాలు ఉన్నా సహించేది లేదని ఎస్పీ సతీష్ కుమార్ హెచ్చరించారు. మండలంలో కుమారస్వామి గుట్టపై కొలువైన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాన్ని శుక్రవారం ఆయన ఓఎస్‌డీ కృష్ణ కాంత్, చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డిలతో సందర్శించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం బందోబస్తు ఏర్పాట్లు, పడవరేవు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో మద్యం దుకాణాలు లేకుండా చూడాలని ఆదేశించారు. వంట దుకాణాలు దూరంగా ఉండాలని ఫైర్ ఇంజిన్, అంబులెన్స్, మెడికల్ టీమ్ అందుబాటులో ఉండాలని సూచించారు. పడవ నిర్వాహణ విషయంపై కలెక్టర్‌తో సంప్రదిస్తామని, లైఫ్ జాకెట్లు, సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్పీని ఎండోమెంట్ చైర్మన్ చిలకం హరనాథ్ శాలువాకప్పి సత్కరించారు. తహసీల్దార్ కె.అనసూయ, ఇన్‌చార్జి ఎంపీడీవో ఫణీంద్ర, ఎస్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

నర్సింగరావుకు ఆత్మీయ సత్కారం



డాక్టర్ నర్సింగరావును సత్కరిస్తున్న ఎంపీ మాధవి, జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్లు సుభద్ర, స్వాతిరాణి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: పాడేరు జిల్లా ఆస్పత్రిలోని గైనిక్ విభాగాధిపతిగా నియమితులైన,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావును ఘనంగా సన్మానించారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆయనను సత్కరించారు.

మృతురాలి కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ



పూజిత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ

హుకుంపేట: మండలంలోని రాప సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్న చెట్టి పూజిత అనారోగ్యంతో విశాఖలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శుక్రవారం పూజిత స్వగ్రామం రంగశీల వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీ మాధవి మాట్లాడుతు మృతురాలు పూజిత కలిసి చదువుకున్నామని, తమ అనుబంధాన్ని గుర్తు చేసి కన్నీరుమున్నీరుగా విలపించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లి, ఎంపీపీ కూడా రాజుబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారయణ, మాజీ ఎంపీపీ రవిప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్ సురేష్‌కుమార్, యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, నాయకులు చినసత్యం, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో పట్టాలు తప్పిన గూడ్స్

- 8 వ్యాగన్లు బోల్తా
- నిలిచిన రైళ్ల రాకపోకలు
- రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రద్దు



గూడ్స్ రైలు పట్టాలు తప్పిన దృశ్యం

సాక్షి, పాడేరు: కొత్తవలస–కిరండూల్ రైల్వేలైన్‌లో శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా సుకు స్టేషన్‌కు సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో 8 వ్యాగన్లు చెల్లాచెదురయ్యాయి. విశాఖ నుంచి కిరండూల్‌కు గూడ్స్ రైలు ఖాళీగానే వెళుతోంది. గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో కేకే లైన్‌లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం విశాఖ నుంచి కిరండూల్ బయలుదేరిన పాసింజర్ రైలును అరకులోయ వరకే నడిపారు. అక్కడి నుంచి మధ్యాహ్నం విశాఖకు పాసింజర్ రైలును పంపారు. అలాగే కిరండూల్ నుంచి రావాల్సిన పాసింజర్ రైలును ఒడిశాలోనే నిలిపివేశారు. విశాఖపట్నం నుంచి రాత్రి నడిచే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. ఈ మార్గంలో గూడ్స్ రైళ్లు కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

వైభవంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఉరేగిస్తున్న డాక్టర్ నర్సింగరావు, కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఉమా నీలకంఠేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను శుక్రవారం రాత్రి పాడేరులో ఘనంగా ఊరేగించారు. గురువారం రాత్రి ఉమా నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు,ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు పల్లకీలో ఉంచి మోశారు. కేరళకు చెందిన వాయిద్యాలు, బ్యాండ్, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు రామంపంతులు, వైస్ ఎంపీపీ శివకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి సుబ్బారావు, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము, సాధనాల గోపీనాయుడు, ఉప్పల వెంకటరత్నం, శివరాత్రి శ్రీనివాసరావు, కొట్టగుల్లి రామారావు,గిరిజన ఉద్యోగ,ఉపాధ్యాయులు వర్తకులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రారంభం



సారె తీసుకువెళ్తున్న అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి

పాడేరు రూరల్ : మండలంలోని ఇరడాపల్లి పంచాయతి ఎస్.బొడ్డాపుట్టు గ్రామంలో శుక్రవారం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారంతా స్వామి వారికి ప్రత్యేక సారెను తీసుకువచ్చారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు భక్తిభావంపై అడుగులు వేయాలన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరు ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారంతా హుకుంపేట మండలం మతం శ్రీ మత్స్యలింగేశ్వర స్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. మహాశివ రాత్రి సందర్భంగా అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. ఇరడాపల్లి సర్పంచ్ గల్లెలి అశ్విజ, ఎంపీటీసీ సుబ్బయమ్మ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గల్లెలి లింగమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కాఫీ రైతుల ధర్నా



కాఫీ రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని తమ సమస్యలు పరిష్కరించాలని కాఫీ రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఐటీడీఏ వద్ద వారు ధర్నా నిర్వహించారు. 11 మండలాల పరిధిలో కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయి సొమ్మును తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు. బకాయి పడిన రూ.60 కోట్లను వెంటనే చెల్లించాలని, కాఫీ రైతులకు ఇస్తున్న ప్రోత్సాహక సొమ్మును రూ.36 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని కోరారు. ప్రతీ కాఫీ తోటకు ఇన్సూరెన్సు సదుపాయం కల్పించాలని కోరారు. మిరియాల రైతులకు వ్యక్తిగత నిచ్చెనలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ రైతుల వద్దకు వచ్చారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు రైతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల క్రితమే ఈ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. కొత్త కాఫీ ప్రాజెక్టులో రైతులకు బ్యాంకుల ద్వార రుణాలు ఇప్పిస్తామని పేర్కొన్నారు. రైతులు రూ.20 చెల్లిస్తే రూ.2లక్షల ఇన్సురెన్స్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన కాఫీ రైతు సంఘం అధ్యక్షుడు పాలికి లక్కు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ డి. గంగరాజు, గిరిజన కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు గెమ్మెలి చిన్నబాబు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మా పృధ్వీరాజు, ముంచంగిపుట్టు మండల కార్యదర్శి ఎం.ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.